క్లుప్తంగా

పొగాకు సరాసరి ధర కేజీ రూ.313



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సరాసరి ధర కేజీ రూ.313.79 పలికింది. ఎం.నిడమానూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 1041 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 965 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 76 బేళ్లు తిరస్కరించారు. గరిష్ఠ ధర కేజీ రూ.360, కనిష్ఠ ధర రూ.205 పలికింది. వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

8న పాఠశాల కమిటీలకు ఎన్నికలు

సీఎస్‌పురం(పామూరు): పాఠశాల యాజమాన్య కమిటీలకు ఈ నెల 8న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ రాజాల కొండారెడ్డి తెలిపారు. దీనిపై ఈ నెల ఒకటో తేదీ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశామని, ఓటరు జాబితాలను గురువారం పాఠశాల నోటీస్‌బోర్డుల్లో ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీల గడువు రెండేళ్లు ఉంటుందని, గతంలో ఉన్న కమిటీల గడువు ముగిసినందున పాఠశాల నూతన యాజమాన్య కమిటీలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. 8వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ ముగింపు, మధ్యాహ్నం 1.30 గంటలకు ఎన్నికైన కమిటీ సభ్యులతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, 2 గంటలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు కమిటీ మొదటి సమావేశంతో కార్యక్రమం పూర్తవుతుందని ఎంఈఓ వివరించారు.

మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత



నష్ట పరిహారం బాండ్లను అందచేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి రూరల్: ఇటీవల పునుగోడు వద్ద జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నష్ట పరిహారం నగదు బాండ్లను గురువారం ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా అందచేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేసిన బాండ్లను బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ కేవీజీ సత్యన్నారాయణ, ఈఈ ఎం హరిబాబు, డీఈ ఆర్ ఉమాకాంత్, ఏఈలు వి.పవన్‌కుమార్, ఎస్కే రసూల్, సీహెచ్ రాజేష్, విద్యుత్ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, ఎస్ అహమ్మద్, ఎస్కే ఫిరోజ్, మాజీ ఎంపీపీ నంబుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

29 మందికి వైద్య పరీక్షలు

వలేటివారిపాలెం: మండలంలోని కాకుటూరు పంచాయతీలోని చెర్లోపల్లిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 29 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ మణి దీపిక తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాంపులో డాక్టర్ మణిదీపిక జ్వరం, జలుబు, దగ్గు, బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు చేసుకోవాలని తెలిపారు.

జేవీవీ నాయకుడు జంపాకు నివాళి

కనిగిరి రూరల్: జేవీవీ జాతీయ నాయకుడు జంపా కృష్ణ కుమార్ ప్రథమ వర్ధంతిని స్థానిక వివేకానంద స్టడీ సర్కిల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్కే గయాజ్ మాట్లాడుతూ జేవీవీ ఆరంభం నుంచి సైన్స్ ప్రచారంలో అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యం చేశారన్నారు. ఎంతో మంది జేవీవీ కార్యకర్తలను తయారు చేశారని కొనియాడారు. నాయకులు ఆదినారాయణ, వైస్ ఎంపీపీ ధనుంజయ్, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాము కుట్టి మహిళకు అస్వస్థత

పీసీపల్లి: పొలంలో పనిచేసుకుంటున్న మహిళను పాము కుట్టిన ఘటన పీసీపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని నేరేడుపల్లికు చెందిన సంగటి చినమాలకొండమ్మ పొలంలో పనులు చేసుకుంటుండగా రక్తపింజర పాము కుట్టింది. దీంతో కొండమ్మ తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

ఎగనామం..!

- బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటున్న సర్కారు
- నిత్యావసరాలు ఇవ్వకుండా రెండు నెలలుగా దాటవేత
- ఇది'కోతల' కూటమంటూ జనం మండిపాటు



కనిగిరి ఎఫ్‌సీఐ గోడౌన్ పాయింట్

కనిగిరి రూరల్:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే ప్రజలను అందలమెక్కిస్తామని చెప్పి ప్రచార వాగ్దానాలు చేశారు. చౌకదుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీపై బియ్యం, కంది పప్పు, చెక్కర, గోధుమపిండి వగైరా వస్తువులను సరఫరా చేస్తామని చెప్పిన మాటలు నీటిలో మూటలుగా మారాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కార్డులోని ప్రతి లబ్ధిదారునికి 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం, కుటుంబానికి కిలో కందిపప్పు, అరకిలో పంచదార, కిలో గోధుమపిండి ఇంటి దగ్గరకే వచ్చి మొబైల్ వాహనంలో కార్డుదారులకు సరఫరా చేసింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై మీనమేషాలు లెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత రెండు నెలలకు రేషన్ లబ్ధిదారులకు బియ్యంతో సరి పెడుతుంది. రెండు నెలల నుంచి కందిపప్పు, పంచదార, గోధుమపిండి ఇవ్వడం లేదు. ఆగస్టు నెల కూడా పంచదార, కందిపప్పు, గోధుమ పిండి లేనట్లే.

గోడౌన్‌లలో మగ్గుతున్న పంచదార..?

జిల్లాలోని అన్ని ఎఫ్‌సీఐ గోడౌన్‌లలో పంచదార నిల్వలు ఉన్నట్లు తెలిసింది. కనిగిరి ఎఫ్‌సీఐ గోడౌన్ పాయింట్‌లో సుమారు 9 టన్నులు, పామూరు ఎఫ్‌సీఐ గోడౌన్ పాయింట్‌లో సుమారు 8 టన్నులకు పైగా చక్కర నిల్వలు ఉన్నట్లు సమాచారం. అయితే ఆ శాఖ మంత్రి, అధికారుల ఆదేశానుసారం వాటిని పంపిణీ చేయకుండా రెండు నెలల నుంచి గోడౌన్‌లలోనే ఉంచారు. ఉన్న స్టాక్‌ను పంపిణీ చేసినా.. కనీసం పట్టణ కార్డుదారులకు ఉపయోగ పడుతుంది. కానీ ప్రభుత్వం ఆదిశగా ముందడుగు వేయడం లేదు.

డీఎస్ఓ ఏమన్నారంటే..

దీనిపై డీఎస్ఓ ఉదయ్‌భాస్కర్‌ను వివరణ కోరగా.. ఆగస్టు నెలకు బియ్యం ఒక్కటే సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. చక్కెర, కందిపప్పు టెండర్‌లు దశలో ఉన్నందున సెప్టెంబర్ నెల నుంచి కార్డుదారులకు సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లాలోని కొన్ని గోడౌన్‌లలో చక్కెర నిల్వలు ఉన్నది వాస్తవమేనని, ప్యాకెట్లలో 20, 30 గ్రాములు తేడా ఉండటంతో వాటిని వెనక్కి పంపుతున్నట్లు చెప్పారు.

అంతన్నారు..ఇంతన్నారు..

కనిగిరి నియోజకవర్గంలోని 201 షాపుల్లో సుమారు 75, 942 రేషన్‌కార్డులు ఉన్నాయి. నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు మండల కేంద్రాల్లో ఎఫ్‌సీఐ గోడౌన్ పాయింట్లు ఉన్నాయి. కనిగిరి ఎఫ్‌సీఐ గోడౌన్ పాయింట్ నుంచి కనిగిరి మండంలోని 46 షాపుల్లోని 24,400 కార్డులు ఉండగా, హెచ్‌ఎంపాడు మండలంలోని 18 షాపుల్లో 5,679 కార్డులు, వెలిగండ్లలో 18 షాపులకు 5,750 కార్డులు, పీసీపల్లిలో 21 షాపులకు 8,113 కార్డులకు కనిగిరి పాయింట్ నుంచి రేషన్ సరుకులు సరఫరా చేస్తారు. దానికి గాను 600 టన్నుల బియ్యం, గోధుమ పిండి 40 టన్నులు, కందిపప్పు 55 టన్నులు, చక్కెర సుమారు 27 టన్నులు సరఫరా ప్రతి నెల ఉంటుంది. అలాగే పామూరు పాయింట్ నుంచి పామూరు 44 షాపులకు, సీఎస్‌పురంలోని 35 షాపులకు, వెలిగండ్ల 7, కనిగిరి 8, పీసీపల్లి 6 షాపులకు సరఫరా చేస్తున్నారు. పామూరు పాయింట్ పరిధిలోని సుమారు 32 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటికి సంబంధించి 530 టన్నులు పీడీఎస్ బియ్యం, 20 టన్నుల చక్కెర, 40 టన్నులు కందిపప్పు వినియోగదారులకు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆగస్టు నెలకు సంబంధించి ఒక్క బియ్యం మాత్రమే సరఫరా చేస్తుండగా, మిగతా వాటికి ఎగనామం పెట్టారు. కనిగిరి పాయింట్‌లో మాత్రం గోధుమ పిండి (రూరల్ గ్రామాల్లోని షాపులకు) 30 టన్నులు సరఫరా చేసినట్లు తెలిసింది. పట్టణంలోని 16 షాపులకు గోధుమ పిండి కేటాయింపుల కోటా తగ్గడంతో దుకాణాలకు సరఫరా నిలిపి వేశారు.

మాల్యాద్రి భౌతికకాయానికి దద్దాల నివాళి



నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, కస్తూరిరెడ్డి

కనిగిరి రూరల్: మండలంలోని జమ్మలమడక సర్పంచ్ పాశం కొండయ్య అన్న కుమారుడు పాశం మాల్యాద్రి(36) ప్రమాదంలో మృతి చెందాడు. జమ్మలమడకలో పాశం మాల్యాద్రి భౌతిక కాయాన్ని గురువారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దేవుడు వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సర్పంచ్ పాశం కొండయ్య, రైతు అధ్యక్షుడు పోలక సిద్దారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రసాదరావు సేవలు ప్రశంసనీయం



డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కందుకూరు: సెకండరీ గ్రేడ్ టీచర్‌గా, మండల విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖాధికారిగా ఎంవీవీ ప్రసాదరావు సేవలు ప్రశంసనీయమని ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కొనియాడారు. ఉప విద్యాశాఖాధికారి ఎంవీవీ ప్రసాదరావు ఉద్యోగ విరమణ సన్మాన సభ బుధవారం స్థానిక జనార్దన స్వామి కల్యాణ మండపంలో నిర్వహించారు. అహర్నిశలు అంకితభావంతో పనిచేశారని, ఉద్యోగ విరమణ అనంతరం ఆయన శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎంతో పని ఒత్తిడి ఉన్నా ఎలాంటి మచ్చ లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని కొనియాడారు. ఎంఈఓ సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘ నాయకులు మాధరావు, పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మంచినీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

గుడ్లూరు(కందుకూరు): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని వైద్యాధికారి పి.మారుతీరావు సూచించారు. మండలంలోని మొగుళ్లూరు కేజీబీవీ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పారిశుధ్యం, హైజెనిక్ కండిషన్‌ను పరిశీలించారు. తాగునీటిని పరిశీలించి పరీక్షలు నిర్వహించారు. మరుగుదొడ్లు, వాష్‌రూమ్, డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్, హాస్టల్ రూంలను పరిశీలించి సూచనలు చేశారు. అతిసార ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాణ్యమైన పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధుల సోకకుండా ఉండొచ్చన్నారు. వ్యాధుల సీజన్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ భాస్కరరావు, ఏఎన్‌ఎం కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ నారాయణకు ఘన సన్మానం



ప్రిన్సిపాల్ నారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టంగుటూరు: స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసున్న బి.నారాయణరావు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థుల ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందిస్తానని నారాయణ భరోసా ఇచ్చారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కళాశాల చైర్మన్ పోతుల రామారావు, చిడిపోతు వెంకటేశ్వర్లు, ఉన్నం వెంకట సుబ్బయ్య, ఇంటర్ బోర్డు ఆర్ఐఓ సైమన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు డేవిడ్‌కు సన్మానం



ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

గుడ్లూరు(కందుకూరు): మండలంలోని అడవిరాజుపాలెం పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు డేవిడ్‌ను తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా అనేక పాఠశాలలో పనిచేసి విద్యార్థులకు భవిష్యత్‌కు బాటలు చేశారని, ఎంతో విద్యార్థులకు మార్గదర్శకులు గా నిలిచారని కొనియాడారు.

అన్యపదార్థాలు లేకుండా చూసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న వేలం నిర్వహణాధికారి సునీల్ కుమార్

కొండపి(సింగరాయకొండ): పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్యపదార్థాలు చూసుకోవాలని, అలాంటి బేళ్లకు అధిక ధర పొందవచ్చని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం వేలం కేంద్రంలో రైతులకు సలహాలు, సూచనలు చేశారు. ఎస్ఎస్.కండ్రిక, పెట్లూరు, వర్ధినేనివారిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాల రైతులు 1032 బేళ్లను వేలనికి ఉంచగా 948 కొనుగోలయ్యాయి. గరిష్ఠ ధర రూ 358, కనిష్ఠ ధర రూ.205, సరాసరి ధర రూ.300.49 పలికింది. వేలంలో 28 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

ఇసుక లారీ, జేసీబీ పట్టివేత



పట్టుబడిన జేసీబీతో సెబ్ ఎస్సై దయాకర్, సిబ్బంది

కొండపి(సింగరాయకొండ): అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక లారీ, ఇసుక తవ్వుతున్న జేసీబీకి లక్ష రూపాయలు జరిమానా విధించిన సంఘటన బుధవారం కొండపి మండలంలోని మూగచింతల గ్రామ సమీపంలో ముసి నది వద్ద చోటుచేసుకుంది. ముసి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించడానికి సిద్ధంగా ఉన్న లారీ, అక్రమంగా ఇసుక తవ్వుతున్న జేసీబీని సీజ్ చేసినట్లు సెబ్ ఎస్సై దయాకర్ తెలిపారు. లారీ రెండోసారి ఇసుక అక్రమ రవాణా చేస్తూ పట్టుబడటంతో రూ.50 వేలు జరిమానా, జేసీబీ మొదటిసారి పట్టుబడటంతో రూ.50 వేల జరిమానా విధించినట్లు వివరించారు.

హెల్మెట్ ధరించడం ఎంతో ముఖ్యం



మాట్లాడుతున్న చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: హెల్మెట్ ధరించడం భారంగా కాకుండా బాధ్యతగా భావించి ప్రాణాలను రక్షించుకోవాలని మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్కే అబ్దుల్ గఫార్, న్యాయవాది పాశం పిచ్చయ్య అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ, స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వాహనం నడిపే వారు వెనుక కూర్చున్న వారు ఇద్దరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించి ఉన్నప్పుడు ప్రమాదాలు జరిగినా ప్రాణనష్టం ఉండదని వివరించారు. విద్యార్థులు, యువత హెల్మెట్ వాడకం వలన కలిగే ఉపయోగాలను, లాభాలను తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్‌బాబు, గంధం సామ్యుల్, నవకుమార్, రాజేష్ పాల్గొన్నారు.

సేవాహిత కార్యక్రమాలు అభినందనీయం

- చైర్మన్ అబ్దుల్ గఫార్



సాయం అందచేస్తున్న చైర్మన్ గఫార్, డాక్టర్ శివకృష్ణ

కనిగిరి రూరల్: మదర్‌థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవాహిత కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక గార్లపేట రోడ్డులోని ఏబీ సూపర్ స్పెషాలిటీ క్లీనిక్‌లో థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నిరుపేద విద్యార్థినికి పుస్తకాలు, నోట్‌బుక్‌లు కొనుగోలు నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయాన్ని చైర్మన్ గఫార్, డాక్టర్ ఎస్ శివకృష్ణ చేతుల మీదుగా అందచేశారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పేద విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి థెరిస్సా సేవాసమితి సభ్యులు చేస్తున్న కృషిని కొనియడారు. మదర్‌థెరిస్సా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ నాయబ్ రసూల్, పి. అరుణోదర్, వాగిచర్ల వెంకటేశ్వర్లు, కోమటిగుంట్ల బాబురావు, బీసీ సంఘాల నాయకులు కె. పెద్దన్న, ఈర్ల విజయరామరాజు, చెరుకూరి చిన కాశయ్య, ఆర్‌ఎంపీ వైద్యులు డి.చెంచులు, ఖాశిం, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి



యాక్షన్ ప్లాన్ విడుదల చేస్తున్న సీడీపీఓ, సూపర్ వైజర్

కనిగిరి రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని సీడీపీఓ పి.సరోజని అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం వగ్గంపల్లి సెక్టార్ సమావేశం సూపర్‌వైజర్ పార్వతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పి.సరోజని మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 9 గంటలకు తెరచి సాయంత్రం నాల్గు గంటల వరకు పనిచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని ప్రతి పిల్లవాడు కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీలో అమలు జరిగే పథకాలపై తల్లిదండ్రులకు, బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్రాలకు ప్రభుత్వం అందచేసే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరికీ అందజేయాలన్నారు. ప్రీ స్కూల్‌ను నిర్వహణలో బాధ్యతగా ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా, నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సూపర్ వైజర్ పార్వతి మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే పౌష్టికాహార వస్తువులను, బాలామృతం వస్తువులను గర్భిణులు, బాలింతలకు అందచేసిన వెంటనే యాప్‌లో నమోదు చేయాలన్నారు. నెలవారి నివేదికలను, రికార్డులను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం 100 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి



పెద్దగొల్లపల్లి గ్రామంలో నిమ్మతోటలు పరిశీలిస్తున్న ఆర్టీకల్చర్ అధికారిని

హనుమంతునిపాడు: పండ్లతోటల రైతులు ఉద్యానవన అధికారులు సలహాలు, సూచనల మేరకు తెగుళ్ల నివారణకు మందులు వాడాలని ఉద్యానవన శాఖాధికారి ఎం అంజలిబాయి అన్నారు. మండలంలోని పెద్దగొల్లపల్లిలో సాగులో ఉన్న నిమ్మ, దానిమ్మ తోటలను పరిశీలించారు. నిమ్మ తోటలకు వేరుకుళ్లు, ఆకుముడత, పేనుబంక, మంగు, మానుబంక, ఎండుపుల్ల తెగుళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఎండుపుల్లను కత్తిరించి వేయాలని సూచించారు. నివారణకు వర్షాకాలం మొదటి దశలో పది కిలోల పశువుల ఎరువులో ట్రైడోడెర్మా, ఫూడోమోనాస్ కలిపి చెట్ల మొదుళ్ల వద్ద వేయాలన్నారు. అనంతరం మొదళ్ల వద్ద నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దానిమ్మలో తెగుళ్ల నివారణకు, పంట దిగుబడి వచ్చేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలపై సూచలిచ్చారు. వీవీఏ కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.

దేవి సీఫుడ్స్‌లో కలెక్టర్ తనిఖీ



రొయ్యల ప్రాసెసింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సింగరాయకొండ: జిల్లాలో ఆక్వా రంగం అభివృద్ధిపై సమగ్ర పరిశీలనలో భాగంగా బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా సింగరాయకొండ మండల కేంద్రంలోని దేవి సీ ఫుడ్స్ సంస్థను సందర్శించారు. కంపెనీలో రొయ్యల ప్రాసెసింగ్, ప్యాకింగ్, భద్రపరిచే విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఇందుకోసం కంపెనీ నిబంధనల ప్రకారం ప్రత్యేక దుస్తులు ధరించి, ప్రతి విషయాన్ని ఆసక్తిగా తిలకించారు. అనంతరం సిబ్బంది క్వార్టర్స్‌ను పరిశీలించారు. ప్యాకింగ్ చేసిన ఆక్వా ఉత్పత్తులను ఏయే దేశాలకు ఎగుమతి చేస్తారో కంపెనీ మేనేజర్ గిరిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి, మండల మత్స్యశాఖాధికారులు రవి, ఎస్‌వీఎస్ వర్షిణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకోటలో స్వాతంత్ర్య వేడుకలకు కరేడు పాఠశాల ఎంపిక

ఉలవపాడు: ఢిల్లీలోని ఎర్రకోటలో ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర దినోత్సవానికి కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పన్నూరు శ్రీనివాసులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఐదు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ఎంపిక చేసిందన్నారు. అందులో కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కాటాబత్తిన కృష్ణ, విద్యార్థి కోటంగారి సాయిచరణ్ ఉన్నారు. వీరిద్దరిని బుధవారం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

సింగరాయకొండ సీఐగా హజరత్తయ్య



హజరత్తయ్య

సింగరాయకొండ: ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని సింగరాయకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ హజరత్తయ్య నియమితులయ్యారు. గతంలో ఈయన కొండపి నియోజకవర్గంలోని సింగరాయకొండ, టంగుటూరు స్టేషన్లలో ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఇక్కడ సీఐగా పనిచేస్తున్న దాచేపల్లి రంగనాథ్‌ను వీఆర్‌కు పంపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎస్టీల సమస్యలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి తహసీల్దార్

సింగరాయకొండ: ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్ల గ్రామ ఎస్టీ కాలనీలో బుధవారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. బాతుల పరిశ్రమను విద్యుత్ కేటగిరీ-4కు మార్చాలని, డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, జాబ్‌కార్డులు ఇప్పించాలని ఎస్టీలు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఇన్‌చార్జి తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం రెవెన్యూ అధికారులే వచ్చారు. ఆర్ఐ ప్రవీణ్, వీఆర్ఓ విజయ, కట్టా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.